క్లుప్తంగా

ఆలయ పరిసరాలు తనిఖీ



ఆలయ పరిసరాలను తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్ సిబ్బంది

చివ్వెంల : మండల పరిధిలోని దురాజ్‌పల్లి శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది శుక్రవారం ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. జాతరకు లక్షలాది మంది భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా గుట్ట పరిసరాలను బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా గోపి



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా టి.గోపి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యుటేషన్‌పై మండల పంచాయతీ అధికారిగా ఇక్కడకు వచ్చి పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు మద్దిరాల ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి 4నెలల నుంచి మండలంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

పెద్దగట్టు జాతరకు బస్సు సర్వీస్ ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న అధికారులు

భానుపురి (సూర్యాపేట) : పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరకు సూర్యాపేట ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసును శుక్రవారం డిపో అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సురేందర్ మాట్లాడుతూ.. జాతర సందర్భంగా 5రోజుల పాటు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నామని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిపో నుంచి ఏటా జాతర వద్ద ఆర్టీసీకి కేటాయించే తాత్కాలిక బస్టాండ్ వరకు బస్సులు నడుస్తాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సైదులు, గ్యారేజీ ఇన్‌చార్జ్ వీరాచారి, డిపో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



రాములును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తుంగతుర్తి : మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మల్లేపాక రాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. శుక్రవారం సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాములును మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, మట్టపల్లి శ్రీశైలం, మున్న మల్లయ్య, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గుడిపాటి వీరయ్య, షేక్.యాకూబ్, వెంకన్న ఉన్నారు.

రెవెన్యూ సిబ్బందికి సన్మానం

అర్వపల్లి : మండల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులుతో పాటు కార్యాలయ సిబ్బంది శుక్రవారం స్థానిక శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి తహసీల్దార్, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ యాదగిరి, ఆర్‌ఐ పాటి వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామరాజు జలేందర్‌రావ్, ధర్మకర్త అనిల్, భైరబోయిన మహరాజు, సైదులు, రామలింగయ్య, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, చెన్న రమేష్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి అంగీకారం

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో రుద్రంగి నారాయణరావు, రుద్రంగి సాంబయ్యల జ్ఞాపకార్థం వారి కుమారుడు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి రుద్రంగి కిరణ్‌కుమార్‌గుప్త సుమారు రూ.15లక్షలతో ఆంజనేయస్వామి దేవాలయాన్ని నిర్మించనున్నట్లు ప్రకటించారు. శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌ను ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, ధర్మకర్తలు దల్వాయి రేఖశ్రీధర్, నిమ్మల కుమార్, కూరం నాగరాజు, కోటమర్తి శ్రీకాంత్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీరోడ్ల నిర్మాణం

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ.1.10కోట్లు మంజూరు
- ప్రతి గ్రామపంచాయతీకి రూ.5నుంచి రూ.15లక్షల వరకు కేటాయింపు
- గ్రామాల్లో తీరుతున్న సమస్య



తిమ్మాపురంలో కొత్తగా నిర్మించిన సీసీరోడ్డు



కుంచమర్తిలో సీసీరోడ్డు నిర్మించి నీటి క్యూరింగ్‌కు గడ్డిపరుస్తున్న కూలీ

అర్వపల్లి : ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదారులు అద్దంలా తయారవుతున్నారు. దీంతో పల్లెల్లో సైతం రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. పలు గ్రామాల్లో సీసీ రోడ్లు లేక వీధుల్లో మురుగునీరు, వర్షపునీరు నిలుస్తూ అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా జాజిరెడ్డిగూడెం మండలానికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.10కోట్లు మంజూరయ్యాయి. దీంతో అన్ని గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఈ నిధులను ప్రతి గ్రామపంచాయతీకి రూ.5నుంచి రూ.10లక్షల వరకు కేటాయించి పనులు చేపడుతున్నారు.

పలు గ్రామాల్లో పూర్తయిన పనులు..

జాజిరెడ్డిగూడెం మండలంలో 17గ్రామపంచాయతీలు ఉండగా ఇప్పటికే ఉయ్యాలవాడ, కుంచమర్తి, అడివెంల గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేశారు. మిగిలిన కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభిస్తుండగా మరికొన్ని గ్రామాల్లో పనులు మొదలు పెట్టాల్సి ఉంది. ఈ రోడ్ల నిర్మాణంతో గ్రామాల్లో చిన్నచిన్న వీధులు సైతం సీసీరోడ్లుగా మారుతున్నాయి. మురుగునీరు, వర్షపునీరు నిలువకుండా చేస్తున్నారు. ఈ సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య కూడా తలెత్తకుండా ఉంటుంది. సీసీరోడ్ల నిర్మాణంతో గ్రామాల్లోని వీధులన్నీ కొత్త కళ సంతరించుకోనున్నాయి.

పనులు పూర్తి చేశారు



మా గ్రామపంచాయతీ పరిధిలో సుమారు రూ.15లక్షలతో కొత్తగా సీసీరోడ్ల నిర్మాణం చేపట్టాం. ముఖ్యంగా ఈ రోడ్ల నిర్మాణంతో వీధుల్లో మురుగునీరు నిలువకుండా ఉండే సమస్య తీరింది. వీధుల్లో సీసీరోడ్లు వేయడంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉంది.

- జీడి వీరస్వామి, మాజీ సర్పంచ్, తిమ్మాపురం

రూ.5లక్షలతో రోడ్ల నిర్మాణం చేపట్టారు



ఈజీఎస్ నిధులతో మా గ్రామంలో రూ.5లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం పనులు పూర్తి చేశారు. దీంతో గ్రామంలో సీసీరోడ్ల ఇబ్బంది తీరింది. సీసీరోడ్ల నిర్మాణం కోసం ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నాం. సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే సామేలుకు కృతజ్ఞతలు.

- పాశం భాస్కర్‌రెడ్డి, ఉయ్యాలవాడ

కొనసాగుతున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ జాతర



పూజలు చేస్తున్న భక్తులు

పెన్‌పహాడ్ : మండలంలోని చీదెళ్ల గ్రామంలో గల శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వాముల జాతర శుక్రవారం మూడో రోజు కొనసాగింది. మండల పరిధిలోని తంగెళ్లగూడెం గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. భక్తులు ప్రభబండ్లను అందంగా అలంకరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన మహిళా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలను దేవాలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి ప్రారంభించారు. అనంతరం రాత్రి డ్యాన్స్ బేబి డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించగా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపికృష్ణ, మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ జులకంటి వెంకట్‌రెడ్డి, ఎడ్ల వెంకట్‌రెడ్డి, బాదె ధర్మయ్య, రాజీవ్‌గాంధీ, చింత రాంబాబు, కీర్తి వెంకట్రావు, గోపయ్య, బిజిగ గోపి, సంతోష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ, రాస్తారోకో



కోర్టు ఎదుట రహదారిపై రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

చివ్వెంల : హైదరాబాద్‌లోని రంగారెడ్డి కోర్టులో గురువారం న్యాయమూర్తిపై జరిగిన దాడిని నిరసిస్తూ సూర్యాపేట బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ఎదుట రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రోజురోజుకు న్యాయవాదులు, న్యాయమూర్తుల పట్ల దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వం స్పందించి న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డపుకు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణలో అమరజవాన్ల త్యాగం మరువలేనిది

సూర్యాపేటటౌన్ : దేశ రక్షణలో అమరజవానుల త్యాగం మరువలేనిదని పట్టణ ఎస్‌ఐ వాసా ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి తెలంగాణ ఎక్స్ సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ పర్సనల్ వెల్ఫేర్ అసోసియేషన్, వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీర జవాన్లకు కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కల్నల్ సంతోష్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ జవాన్లపై ఉగ్రవాదులు భీకర దాడికి తెగబడ్డారని అన్నారు. ఈ ఘటనలో 40 మంది జవానులు అమరులయ్యారని తెలిపారు. వీరమరణం పొందిన అమర జవాన్ల సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరవరన్నారు. కార్యక్రమంలో సీఏపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎల్‌ఎన్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ జేపీ యాదయ్య, జనరల్ సెక్రెటరీ పి.చంద్రయ్య, మాజీ సైనికులు సీహెచ్.జయరాజ్, షేక్ అబ్దుల్ ఖాదర్, ఏ.నాగయ్య, ఏఎస్‌ఐ వి.ముత్తయ్య, కె.వీరస్వామి, కె.జానయ్య, ఎమ్‌ఎల్‌ఎన్ రెడ్డి, ఇమ్మడి సోమయ్య, డి.నాగులు, వాసవీ యూత్ క్లబ్ అధ్యక్షుడు వెంపటి రవితేజ, యమా సంతోష్, పబ్బతి వేణుమాధవ్, బికుమల కృష్ణ, గుమ్మడవెల్లి శ్యామ్, మైలవరపు సతీష్, శ్రీరంగం రాము తదితరులు పాల్గొన్నారు.

పాలిహౌస్‌లతో రైతులకు మేలు



పాలిహౌస్‌ను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

అర్వపల్లి : పాలిహౌస్‌ల ఏర్పాటుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండల పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొమ్మాల గ్రామంలో గుర్రం శ్రీధర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ఖేతి పాలిహౌస్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాలిహౌస్‌ల ద్వారా మంచి లాభాలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో తుంగతుర్తి మాజీ వైస్ ఎంపీపీ శ్రీశైలం, రైతులు కుంట్ల గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వీరారెడ్డి, సైదిరెడ్డి, కృష్ణారెడ్డి, ఉదయ్, జనార్దన్‌రెడ్డి, వెంకటయ్య, యాదగిరిరెడ్డి, ఖేతి పాలిహౌస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధ్యమైంది



సీఎం, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సూర్యాపేట : ఎన్నో పోరాటాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పడిదల రవికుమార్ మాదిగ, దక్షిణ జిల్లాల అధ్యక్షుడు చింత బాబు మాదిగ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి రాజనర్సింహ, ఇతర నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మాట్లాడారు. 30సంవత్సరాలుగా పోరాడుతున్న మాదిగల చిరకాల స్వప్నం ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేసిన ఘనత తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న మాదిగ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గతంలో సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకోవచ్చని ఆరుగురు జడ్జిలు తీర్పునివ్వగా మొట్టమొదటగా తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి తమ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి అమలు చేశాడన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనుకు జానయ్య, దుబ్బ రమేష్, బాణాల అబ్రహం, కందుకూరి నాగేశ్వర్‌రావు, ఈదయ్య, బుర్రి రవీందర్, హుస్సేన్, దుబ్బ శ్యామ్, దుబ్బ సామేలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలి



మాట్లాడుతున్న షీ టీం ఎస్‌ఐ నీలిమ

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలని షీ టీమ్స్ ఎస్‌ఐ నీలిమ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో షీ టీమ్స్, డ్రగ్స్, సైబర్ నేరాలపై పోలీస్ కళాబృందంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో షీ టీమ్స్, సైబర్ నేరాలపై పటిష్టంగా పనిచేస్తున్నామన్నారు. ప్రతి స్కూల్, కళాశాలలో చదువుకునే విద్యార్థులు ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సైబర్ మోసగాళ్ల మోసాలకు గురికావద్దని, బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డు వివరాలు ఇతరులకు తెలపొద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు ఆడపిల్లలను, మహిళలను వేధింపులకు గురి చేస్తే సూర్యాపేట షీ టీం నంబర్ 8712686056కు సమాచారం ఇవ్వాలని, మీ వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, షీ టీమ్స్ ఏఎస్‌ఐ సాలయ్య, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, సభ్యులు గోపయ్య, నాగార్జున, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి



నాగారంలో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు



ఆత్మకూర్ (ఎస్) : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



నూతనకల్ : చిల్పకుంట్లలో ..

నూతనకల్ : ప్రభుత్వ ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దింటి రంగారెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 14నెలలు పూరైనా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలన్నారు. రేషన్‌కార్డులు, రైతు రుణమాఫీ ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మందడి భూపాల్‌రెడ్డి, పుల్లూరు సింహాద్రి, దగ్గుల మల్లయ్య, పలుసు క్రాంతికుమార్, జటంగి సతీష్, సైదులు, రాములు, పరమేష్, లింగమల్లు, మల్లయ్య, క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగారం : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల -20న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని యానాల వీరారెడ్డి స్మారక స్థూపం వద్ద కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల ఎజెండానే ప్రజాపాలన అని చెప్పి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి నేడు తెలంగాణలో ప్రజల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఎన్నికల ఎత్తుగడలలో భాగంగానే నేడు ఇందిరమ్మ ఇండ్లు అని, స్వయం ఉపాధి అని గ్రామసభలలో తీర్మానాలు ప్రవేశపెడుతుందన్నారు. అర్హులైన పేదలను గుర్తించి ఇండ్లు లేని నిజమైన వ్యక్తులకు ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఈ నెల 20న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపేట కాశయ్య, యానాల సుధాకర్ రెడ్డి, జాజుల సామేలు, ధనుంజయ్, ఉప్పలయ్య, సంజీవ, శ్రీను, జానీ, సైదులు, నాగిరెడ్డి ఉన్నారు.

గ్యారంటీలను అమలు చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు డేగల వెంకటకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆత్మకూర్ (ఎస్), పాతసూర్యాపేట గ్రామాల్లో గ్యారంటీల అమలు కోసం ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇల్లులేని పేదలందరికీ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు, షరతులు లేకుండా రూ.2లక్షల రైతు రుణమాఫీ, రైతు భరోసా, కల్యాణలక్ష్మి పథకానికి తులం బంగారం కలిపి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు పగిడి యల్లయ్య, శ్రీను, నర్సయ్య, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బోయిని నాగయ్య, లింగయ్య పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : దేశంలో మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలని, నిరుద్యోగం, ఆకలి పెరుగుతుంటే వాటిని నిర్మూలించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ అండదండలతో ఫాసిస్టు విధానాలను కొనసాగిస్తుందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని లెనిన్‌నగర్‌లో ఈ నెల 28న ఢిల్లీలో జరిగే సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ అండదండలతో బడా కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ, వారికి అనుకూలమైన విధానాలను రూపొందిస్తుందన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో పీడిత ప్రజల సమస్యలు పదిరెట్లు పెరిగాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్‌కుమార్, నాయకులు పేర్ల నాగయ్య, గొడ్డలి నరసయ్య, సూరం రేణుక, గులాం హుస్సేన్, చిత్తలూరి లింగయ్య, వీరబాబు, బచ్చలకూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టడంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న కోట గోపి

భానుపురి (సూర్యాపేట) : దేశవ్యాప్తంగా రోజురోజుకు దళితులపై దాడులు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడం, సంబంధిత చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో దళితులపై దాడులు తీవ్రతరం అయ్యాయని, తమిళనాడులో ఇంటర్ చదువుతున్న దళిత విద్యార్థిపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కులం పేరుతో జరుగుతున్న అవమానాలు రాజ్యాంగ మనుగడకే ప్రశ్నార్థకమని తెలిపారు. దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలు హత్యలను అరికట్టాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాయకులు నాగమణి, రమణ, టేకుల సుధాకర్, దుర్గారావు, గిరి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడోత్సవం



గరుడ వాహనంపై స్వామి ఊరేగింపు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడ వాహనంపై నర్సింహస్వామి అమ్మవార్లతో కలిసి పురవీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా స్థానికులు టెంకాయలు కొట్టి హారతులిచ్చారు. అలాగే యాగశాలలో నిత్య హోమం, బలిహరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, యోగానంద్, నర్సింహ దీక్షితులు, వేదపండితుడు గుడిపూడి మాధవాచార్యులు, ధర్మకర్తలు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పోస్టల్ ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి

భానుపురి (సూర్యాపేట) : కేంద్ర ప్రభుత్వం పోస్టల్ డిపార్టుమెంట్‌ను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని తపాలా సంఘం జేఏసీ నాయకులు సుధాకర్, నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక పోస్టాఫీస్ వద్ద ధర్నా నిర్వహించి సూర్యాపేట డివిజన్ సూపరింటెండెంట్ వి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్, రవి, పుల్లయ్య, కరీం, కరుణాకర్, దివ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



తుంగతుర్తిలోని ప్రాథమిక పాఠశాలలో పాల్గొన్న విద్యార్థులు



ఆత్మకూర్ (ఎస్) : పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తుంగతుర్తి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి పలువురిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.రఘుపతి, ఉపాధ్యాయులు సీహెచ్ కలమ్మ, గురువయ్య, శ్రీరాములు, సూర్యప్రకాశ్, సుధాకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామయ్య, ఉపాధ్యాయులు నిమ్మల శ్రీనివాస్, జయప్రద, షర్మిల, సునీత, మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఎన్నిక

తుంగతుర్తి : మండల కేంద్రంలో ఈ నెల 19న నిర్వహించే గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఆంగోత్ సోమ్లానాయక్, ఉపాధ్యక్షులుగా కాలు నాయక్, గుగులోతు రాజారాంనాయక్, ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ కృష్ణ నాయక్, బానోత్ శ్రీను, కోశాధికారిగా లాకావత్ నరసింహ, గౌరవ అధ్యక్షులుగా ధారావత్ జమ్మిలాల్, లాకవత్ వెంకన్న, గుగులోతు కాల్‌రామ్, గుగులోతు ఈరోజీ, శ్రీను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సోమ్లానాయక్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఈ నెల 19న నిర్వహించే సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరవుతారని, అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

నాగారం : మండల కేంద్రంలోని సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకుగాను డివైడర్, సెంట్రల్ లైటింగ్ సిస్టం, సర్వీసు రోడ్డును ఏర్పాటు చేయాలని మాజీ సింగిల్ విండో చైర్మన్ గుంటకండ్ల ముకుందారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట నుంచి జనగాం వరకు జాతీయ రహదారిపై ఉన్న అన్ని మండల కేంద్రాల్లో డివైడర్లను, సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసి నాగారంలో మాత్రం వదిలేశారని అన్నారు. మండల కేంద్రంలో జాతీయ రహదారిపై డివైడర్ లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.